క్లుప్తంగా

విద్యార్థుల ఆలోచనలు గొప్పగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆలోచనలు గొప్పగా ఉండాలని రవి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు, న్యూరో సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం రాజాగారితోటలోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలకు మైక్, సౌండ్ బాక్సును అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకుని పది మందికి చేయూత ఇవ్వాలని సూచించారు. ఈసందర్భంగా గత విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనర్సయ్య, న్యాయవాది బొప్పా శ్రీనివాసరావు, వి.మనోజ్, వై.అజయ్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్టీ బాలికల వసతి గృహం సందర్శన



గుంటూరు లీగల్: గుంటురు మహిళా ప్రాంగణంలోని ఎస్టీ బాలికల వసతి గృహం, కాలేజీ ఎట్ హోమ్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. వసతి గృహంలో విద్య, వైద్యం, ఆహారం ఇతర సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అన్ని వసతులు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

జాషువా సాహిత్యం చిరస్మరణీయం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సాహిత్య సభ నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగుశాఖ ఆచార్యులు ఇరవని మాధవి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కవి కోకిల గుర్రం జాషువా సాహిత్యం చిరస్మరణీయం, అత్యంత సరళమైన రీతిలో ప్రతి ఒక్కరి మనమును హత్తుకునేలా ఉంటాయని అన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తాళ్ళూరి వెంకటరత్నారావు సభా పరిచయం చేశారు. సభాధ్యక్షుడుగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, పి.యోహాను, అయినాల మల్లేశ్వరరావు, విశ్రాంత ఎంఈఓ వినుకొండ సి.హెచ్. =జాన్ సుందరరావులను అతిథులు, సంస్థ వారు కలిసి ఘనంగా సత్కరించారు.

శ్రావణ మాస విశేష పూజలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక అరండల్ పేటలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కోటి కుంకుమార్చన ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య పూజల్లో గో పూజ, గణపతి పూజ , శ్రీ చక్ర మహామేరుకు విశేష అభిషేకాలు జరిగాయి. శ్రావణ మాస సందర్భంగా ప్రత్యేకంగా శ్రావణ మంగళ, శుక్రవారాలు అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్న క్రమంలో మొదటి శుక్రవారం అభిషేకం, కలువపూల పూజ వేదమంత్రాలనడుమ కనులపండువగా జరిగింది.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రావణ మాస ప్రారంభం సందర్భంగా మొదటి శుక్రవారం సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రతి ఆగస్టు నెలలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి దగ్గర శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఇక శుభ ఘడియలు...

- శ్రావణమాసం ప్రారంభం
- ముహూర్తాల సందడి
- నవంబర్ దాటితే మళ్లీ 2026 ఫిబ్రవరిలోనే..





ముస్తాబైన కళ్యాణ మండపం(ఫైల్)

నెహ్రూనగర్: శ్రావణ సందడి ప్రారంభమైంది. ఆషాఢం ముగియడంతో మంచి ముహూర్తాల కోసం ఎదురు చూసిన వారు లగ్నాల కోసం వెతుకులాడుతున్నారు. ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, బంగారం దుకాణాలు కిటకిటలాడనున్నాయి. నెలన్నర రోజులుగా గురు మూఢంతో శుభకార్యాలు లేవు. గురువారంతో ఆషాఢ మాసం ముగిసింది. శుక్రవారం నుంచి శ్రావణమాసం మొదలైంది. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకూ దివ్యమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. ఇవి దాటితే మళ్లీ కార్తిక మాసంలోనే వివాహాలకు మంచి ఘడియలని అంటున్నారు. వివాహాలకు మాత్రమే కాదు..కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి, గృహ ప్రవేశాలకు, పూజలు, నోములు, వ్రతాలకు కూడా అనువైన ముహూర్తాలు ఎన్నో ఉన్నాయి.

శుభ ముహూర్తాలు ఇవే...

ఈ నెలలో 26, 27, 30, 31 తేదీలు, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఇక ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకూ భాద్రపద మాసం ఉంటుంది. ఇది శూన్య మాసం అయినందున శుభ ముహూర్తాలు ఉండవు. ఆ తరువాత మళ్లీ సెప్టెంబర్ 23, 24, 26, 27, 28వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30వ తేదీలు కూడా శుభ ఘడియలే. నవంబర్‌లో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో వివాహాలు జరిపించడానికి మంచి ముహూర్తాలున్నాయని పండితులు సూచిస్తున్నారు. ఆ తరువాత డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 6 వరకూ శుభ ముహూర్తాలు లేవని చెబుతున్నారు.

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

మేయర్ కోవెలమూడి రవీంద్ర



మాట్లాడుతున్న మేయర్, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరాన్ని రానున్న కాలంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సుందర, స్వచ్ఛ నగరంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సంయుక్త భాగస్వామ్యంతో తీర్చిదిద్దుతామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర వెల్లడించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ మేయర్‌గా ఎన్నికై శుక్రవారానికి 97 రోజులు అయిందని చెప్పారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం పాలక వర్గం ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 18న ఎన్నిక ఉంటుందని చెప్పారు. నల్లపాడులోని ఇరిగేషన్ స్థలం నగరపాలక సంస్థకు కేటాయించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఆ స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వాకింగ్ ట్రాక్, పార్క్, పిల్లల ఆటల కేంద్రం, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నల్లచెరువు రోడ్డులో ఆక్రమణల తొలగింపు జరుగుతుందని, త్వరలో లక్ష్మీపురం రోడ్, జీటీ రోడ్‌లో కూడా ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపడతామని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ జాబితాలో నిలిచేందుకు అందరి భాగస్వామ్యం ఉందని చెప్పారు. ఈ సీజన్‌లో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి ప్రతి ఇంటితో పాటు కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి మాత్రమే ఇవ్వాలని, లేకుంటే ప్రజారోగ్య కార్మికులు తీసుకోరని పేర్కొన్నారు. ఆగస్టు ఒకటి నుంచి నగర పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నాటికి నగరం ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా నిలిచేలా కృషి చేస్తామన్నారు. పీ4 కార్యక్రమానికి మార్గదర్శులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుడి మృతిపై విచారణ చేపట్టాలి


కమిషనర్‌నకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని దేవాపురం 4వ లైనులో నిర్మాణంలో ఉన్న కల్వర్టు కూలి కార్మికుడు మృతి చెందిన విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులును, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ మేడికొండూరు నాగేశ్వరరావు పనులు పూర్తి చేయడం లేదని ఆరోపించారు. నాణ్యత లేకుండా పనులు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అధికారులు వార్డుల్లో జరిగే పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు చెప్పడం లేదని ఫిర్యాదు చేశారు. 30వ డివిజన్‌లో ప్యాచ్ వర్కు చేశారు.. అప్పుడే కొట్టుకుపోయింది. ఏప్రిల్, మే నెలల్లో డ్రెయిన్లలో సిల్ట్ తీయాల్సి ఉండగా ఇంత వరకు సిల్ట్ తీయలేదు. దీని వలన చిన్న వర్షాలకు రోడ్లు మునిగిపోతున్నాయన్నారు. కార్మికుడి మృతిలో కాంట్రాక్టర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బూసి రాజలత, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, కాంట్రకుంట గురవయ్య, పాపతోటి అంబేడ్కర్, మార్కెట్ బాబు పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మికి విశేషాభిషేకార్చనలు



నగరంపాలెం: స్థానిక సిద్ధార్థ నగర్ 11వ లైనులోని శ్రీ కనకమహాలక్ష్మి మందిరం వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో శ్రావణ మాస విశేష కుంకుమార్చనలు , పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి శ్రావణ శుక్రవార పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించి ప్రత్యేక హారతి అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులు మహిళలకు తీర్థప్రసాదాలను అందించారు.

పెన్షనర్లకు హాని కలిగించే చట్టాన్ని రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

లక్ష్మీపురం: పెన్షనర్లకు హాని కలిగించే వ్యాలీడేషన్ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, పెన్షనర్లకు పీఆర్‌సీ, ఏడీలు వర్తించకుండా చేసే ఈ చట్టాన్ని పెన్షనర్లందరూ వ్యతిరేకించాలని సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ నాగేశ్వరరావు, బి.రామారావు డిమాండ్ చేశారు. గుంటూరు లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వద్ద శుక్రవారం మానవ హారంగా ఏర్పడ్డారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎఫ్ఆర్డీఏ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు సంఘం ప్రధాన కార్యదర్శి వై.బాబూరావు(బీఎస్ఎన్ఎల్) మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎఫ్ఆర్డీఏ బిల్లు పెన్షనర్లకు ఉరితాడు లాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు పూర్తి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం కన్వీనర్‌లు డి.సుబ్బారావు, పి.సాంబశివరావు, బ్యాంక్ పెన్షనర్ల సంఘం నాయకులు కె.హరిబాబు, ఎస్.గణేష్, ఎల్ఐసీ పెన్షనర్ల సంఘం నేతలు ఎం.రాజేశ్వరరావు, సి.హెచ్ అన్నామణి, నరసరావుపేట పోస్టల్ పెన్షనర్ల సంఘనేత ఎస్.జి.జె. ఘోష్, ఇన్ కమ్ ట్యాక్స్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగనాథ్ మాట్లాడారు. ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన రెండు వందల మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధాను జయప్రదం చేయండి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధా కార్యక్రమం నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) సీపీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు, రాష్ట్ర కోశాధికారి కె.విజయరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ నారా లోకేష్, యువగళం పాదయాత్రలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణలో మధ్య దళారులను ఎత్తివేసి రూ.46,000 వేతనం ఇస్తున్నారని, ఆంధ్ర రాష్ట్రంలో మూడు రకాలుగా వేతనాలు ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. అందరికీ ఒకే రకమైనటువంటి వేతనం ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మొదటి నుంచి డిమాండ్ చేస్తుందన్నారు. 2022 పీఆర్సీ అరియర్స్, కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రమే ఎందుకు ఇవ్వకుండా ఆపిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా మీటర్ రీడర్స్, బిల్లు కలెక్షన్ ఏజెంట్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే బాషా, మహమ్మద్ అబ్దుల్ చిష్టీ పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు

పట్నంబజారు: నగరంలోని కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలోని మహిళా ప్రభుత్వ కళాశాల వద్ద కొంత మంది ఆకతాయిలు ఆగడాలు అధికమయ్యాయి. ఉదయం కళాశాల సమయం, సాయంత్రం విడిచిపెట్టే సమయంలో ద్విచక్ర వాహనాలపై హడావుడి చేస్తున్నారు. బైక్‌లపై భరించేలని సైలెన్సర్ సౌండ్లు, స్నేక్ డ్రైవింగ్‌లతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. శుక్రవారం కొంత మంది యువకులు విద్యార్థిని వెంటబడి ఇబ్బందికి గురి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. పలు స్టిక్కరింగ్ పాయింట్లు, టీస్టాల్స్ వద్ద నిలబడి అటుగా వచ్చే విద్యార్థినులను ఈవ్‌టీజింగ్ చేస్తున్నారని తెలుస్తోంది. కనీసం పోలీసులు రక్షక్, బ్లూకోట్స్ వాహనాలు కూడా రావటం లేదని, దీంతో ఆకతాయిలు మరింత రెచ్చిపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు దృష్టి సారించి ఆకతాయిలను నిలురించాలని కోరుతున్నారు.

ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా హరిహర వీరమల్లు చిత్రం

పట్నంబజారు: హరిహర వీరమల్లు సినిమా పేరుతో ముస్లింలపై దుష్ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సినిమాలో చరిత్రలో లేనటువంటి పాత్రను కల్పించి ముస్లింలను కించపరిచేలా కథను నడిపించడమంతా ఒక రాజకీయ అజెండాలో భాగమేనని పేర్కొన్నారు. హరిహర వీరమల్లు అనే పాత్రకు చారిత్రక ఆధారాలు లేవని చరిత్రకారులే స్పష్టం చేస్తున్నారని చెప్పారు. అలాంటి కల్పిత పాత్రల చుట్టూ కథలను నిమిరి, ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఇది ఒక రకంగా ముస్లింల మనోభావాలను దెబ్బతీసే చర్య అని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ వివాదాస్పద పాత్రల్లో నటించటం నైతికంగా, రాజకీయంగా సరికాదనీ అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రోత్సహించే కుట్రగా మేము పరిగణిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ మతాల ప్రజలు శాంతిగా, సహజీవన స్ఫూర్తితో ఉంటున్న తరుణంలో ఇలాంటి చిత్రాలు సామాజిక శాంతికి ముప్పుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

నెహ్రూనగర్: ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మేడిద బాబురావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల(ఏసీ కాలేజీ)లో నిర్వహించనున్న సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార ప్రతినిధులకు (పీఏసీఎస్) సమగ్ర పోషక యాజమాన్యంపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం, మేనేజ్, సమేతి మంగళగిరి సంయుక్తంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమం ద్వారా పోషక యాజమాన్యంపై నిష్ణాతులైన శాస్త్రవేత్తల ద్వారా తరగతులు నిర్వహించి కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు ఎరువుల వినియోగంలో మెలకువలు, జాగ్రత్తలు తెలియజేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడారు.

బాబూ అంటేనే మోసం గ్యారంటీ



మాట్లాడుతున్న నందేటి రాజేష్

పట్నంబజారు: బాబూ ష్యూరిటీ అంటనే మోసం గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్ చెప్పారు. శ్రీనగర్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం స్థానిక పార్టీ నేత దరియాబీ కార్యాలయంలో నిర్వహించారు.. పార్టీ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, ఇష్టానూసారంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను నమ్మించి వంచిన చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు టి.శ్రీను, కుమారి, వెంకట్రావు, శ్రీను, మీరాబీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. చంద్రమౌళినగర్, లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిందూర్‌పై పార్లమెంట్‌లో చర్చ అవసరం

లక్ష్మీపురం: ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ప్రత్యేక ఓటరు సవరణలపై సమగ్రమైన చర్చ పార్లమెంటు ఉభయ సభల్లోనూ జరగాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ ఉద్యమ నేత ఏవీ రామారావు పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కీలకమైన అంశాలపై చర్చ జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో విశ్లేషకులు ఎస్.రవి బాబు, సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి మాట్లాడారు. చర్చలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, విశ్రాంత అధికారి భావన్నారాయణ, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: 'కంచే చేను మేస్తే కాసేదెవరు' అన్న చందంగా ఉంది నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. భార్య.. ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. తన పెద్ద కుమార్తెను స్థానికంగా కార్ డ్రైవింగ్ చేసే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. వాచ్‌మెన్‌కు ఆడపిల్లలే కావడంతో పెద్ద అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. కొడుకు లేని లోటును తన అల్లుడులో చూసుకునేవాడు. ఇదిలా ఉండగా.. ఐదుగురిలో చివరి అమ్మాయి(ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న మైనర్)తో అల్లుడు చనువుగా ఉండేవాడు. ఆమెను పది నెలల క్రితం ఇంట్లో నుంచి తీసుకుని అల్లుడు పరారయ్యాడు. చిన్న కుమార్తె, అల్లుడు కనిపించక పోవడంతో తండ్రి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం అల్లుడిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అల్లుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను మాయమాటలతో తీసుకెళ్లినందుకు, తండ్రి ఫిర్యాదు మేరకు అల్లుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఏఎన్‌యూ అడ్మిషన్‌ల ప్రక్రియ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ మెకానికల్ బ్లాక్‌లో ఈఏపీ సెట్ 2025 అడ్మిషన్‌ల మొదటి విడత గురువారం ప్రారంభమయ్యింది. రెండో రోజు శుక్రవారం అడ్మిషన్‌ల ప్రక్రియను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సందర్శించి అన్ని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు అడ్మిషన్‌ల సందర్భంగా చేసిన అన్ని సదుపాయాలను, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 70 శాతం మంది విద్యార్థులు రిపోర్ట్ చేయగా.. చివరిరోజు శనివారం కూడా విద్యార్థులు హాజరవుతారని ఆశాభావం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్, అన్ని విభాగాల సమన్వయకర్తలు, ఆఫీసు సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కంపోస్ట్ యార్డులో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలి



బుడంపాడులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ కంపోస్ట్ యార్డులో వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కి తరలించాలని.. వాహనాల ట్రిప్‌లు, చెత్త బరువును వేయింగ్ మిషన్ ద్వారా చెక్ చేసి ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటుకూరురోడ్‌లోని కంపోస్ట్ యార్డ్, బుడంపాడులో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వార్డుల వారీగా సేకరించే వ్యర్థాలు అధిక శాతం ఏటుకూరు రోడ్ కంపోస్ట్ యార్డ్‌కి వస్తుందని, యార్డ్‌కి వచ్చే ప్రతి వాహనం ట్రిప్‌లు, తెచ్చే చెత్త బరువుని రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. వర్మి కంపోస్ట్ బెడ్స్ పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈను ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ సతీష్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీతం పెంచమని అడిగినందుకు నిర్బంధం, దాడి

లక్ష్మీపురం: నెలవారి జీతం పెంచమని యజమానులను అడిగడంతో ఓ యువకుడిని నిర్బంధించి ఇష్టం వచ్చినట్లు కొట్టి గాయాలు పలు చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నల్లచెరువు ప్రాంతానికి చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు, అరండల్‌పేట 7వ లైన్‌లో శ్రీ హేమ సాయి ఫర్నిచర్స్, అరండల్‌పేట 4వ లైన్‌లోని రోబల్సర్ ఫర్నిచర్ షాపులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే రెండు షాపులలో పని చేస్తున్న నేపథ్యంలో రామిశెట్టి శ్రీనివాసరావు రెండు షాపుల యజమానులు అయిన అమరా సుబ్బారావు, అమరా నాగేశ్వరరావులను నెలవారి జీతం పెంచాల్సిందిగా కోరాడు. దీంతో ఇద్దరు కలిసి శ్రీనివాసరావును నిర్బంధించి ఇష్టం వచ్చినట్లు కొట్టి తీవ్రంగా గాయాలు పాలు చేశారు. దీంతో బాధితుడు చికిత్స అనంతరం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం సీపీఐ కర్తవ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగా ల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక శారదా కాలనీ లో పార్టీ నగర మహాసభలు గురువారం నిర్వహించారు. నూతన నగర కార్యదర్శిగా ఎన్నికైన ఆకిటి అరుణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రజా సమస్యల పరిష్కారంలో అత్యంత చురుకైన పాత్ర నూతనంగా ఏర్పడినటువంటి నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు, నగర కమిటీ సభ్యులు మంగ శ్రీనివాసరావు, జి. లక్ష్మి, మహమ్మద్ జైద్, బి.వెంకటేశ్వర రెడ్డి, జంగాల చైతన్య, వి.వెంకటేశ్వర్లు, ధూపాటి వెంకటరత్నం, జి.సురేష్ బాబు, చల్ల చిన ఆంజనేయులు, నూతలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.